క్లుప్తంగా

గూగూడు కుళ్లాయిస్వామిని దర్శించుకున్న శైలజానాథ్



కుళ్లాయిస్వామి దర్శనం కోసం వస్తున్న మాజీ మంత్రి శైలజానాథ్

నార్పల: మండలంలోని గుగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి శైలజానాథ్ సోమవారం పీర్లను దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పక్కనే ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు మాజీ మంత్రికి స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సత్యనారాయణరెడ్డి, బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ నాగేశ్వరరావు, కన్వీనర్లు ఖాదర్‌వలి, పూల ప్రసాద్, ఎంపీటీసీలు రాజారెడ్డి, శంకర్ యాదవ్, రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు లోక్‌నాథ్‌రెడ్డి, రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివ శంకర్‌రెడ్డి, శివయ్య సాబిర తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి తేవాలి



తొండపాడులో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

గుత్తి రూరల్: గ్రామాల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ సూచించారు. మండలంలోని తొండపాడు గ్రామంలో ఉన్న సంపద తయారు కేంద్రాన్ని జెడ్పీ సీఈఓ సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోజూ పోగయ్యే చెత్త నుంచి సంపద తయారు చేసి గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. అనంతరం గ్రామంలోని పలు కాలనీల్లో సీఈఓ పర్యటించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, కార్యదర్శి ఎర్రిస్వామి పాల్గొన్నారు.

‘అభయ విద్యానిధి’ సేవలు అభినందనీయం



గేట్స్ అధినేత్రి పద్మావతమ్మ, లక్ష్మీబాలయ్య తదితరులను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: ఆడపిల్లల ఉన్నత చదువులకు ఆర్థిక చేయూతనందిస్తున్న అభయ విద్యానిధి సంస్థ సేవలు అభినందనీయమని తహసీల్దార్ రమాదేవి, గేట్స్ కళాశాల కరస్పాండెంట్ వి.కె. పద్మావతమ్మ, డాక్టర్ లక్ష్మీబాలయ్య అన్నారు. స్థానిక నామాలసేట్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రాత్రి అభయ విద్యానిధి 10వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అభయ విద్యానిధి వ్యవస్థాపక చైర్‌పర్సన్ వసుంధరదేవి, అధ్యక్షురాలు మాధవీలత, కార్యదర్శి వరలక్ష్మి, కోశాధికారి అనురాధ, వ్యాపారవేత్తలు సురేష్‌గుప్త, జగదీష్‌గుప్త, జీవీ లక్ష్మణ్, దేవేంద్ర, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

తాడిపత్రిటౌన్: మండలంలోని బోడాయిపల్లిలో గత నెల 27న జరిగిన దాడి ఘటనలో సోమవారం రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి, ఎస్ఐ ధరణీబాబు అదే గ్రామానికి చెందిన ఇరువర్గాలకు చెందిన బాలయ్య, జగదీష్‌కుమార్, పృథ్వీరాజ్‌ను వేర్వేరు ప్రాంతాల్లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అధికారులకు పట్టని గ్రీవెన్స్!

- 23 మందికి గానూ రిజిస్టర్‌లో ముగ్గురు అధికారుల సంతకాలు
- వారిలో ఒకరు మాత్రమే హాజరు

తాడిపత్రి రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. దీంతో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 23 మంది అధికారులకు కేవలం ముగ్గురు హాజరు కావడం గమనార్హం. వీరిలో ఏడబ్ల్యూట్, హార్టికల్చర్‌శాఖలకు చెందిన ఇద్దరు ఉద్యోగులు మాత్రం రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి వెళ్లగా ఎస్ఆర్‌జీఎస్ శాఖకు చెందిన మహిళా ఉద్యోగి మాత్రమే తహసీల్దార్ సోమశేఖర్‌తో కలసి కార్యాలయంలో కూర్చోవడం మిగిలిన ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోంది. ప్రజల నుంచి ఫిర్యాదులను తీసుకోవడానికి ఆయా శాఖలకు చెందిన 23 మంది అధికారులతో కూడిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 వరకూ అధికారులు తప్పనిసరిగా కార్యాలయంలో అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఫిర్యాదులను తీసుకోవాలని కలెక్టర్ ఉత్తర్వులు ఉన్నాయి. ఆయా శాఖలకు చెందిన అధికారులకు ఇతర కార్యక్రమాలు ఉంటే వారి తరఫున మరొకరిని పంపాల్సి ఉంటుంది. కానీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అంటే అధికారులకు నిర్లక్ష్యంగా ఉంటోంది. కొన్ని శాఖల అధికారులు రావడమే మానివేశారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు డుమ్మా కొట్టిన అధికారులకు సంజాయిషీ కోరుతూ తహసీల్దార్ కార్యాలయం నుంచి నోటీసులు పంపకపోవడం వల్ల వారిని చూసుకొని మిగిలిన శాఖల అధికారులు కూడా డుమ్మా కొడుతున్నారు. అలాగే సమస్యల పరిష్కారం కోసం వచ్చిన బాధితులను తహసీల్దార్ వద్దకు వెళ్లనీయకుండా తలుపు వద్ద కొందరు సిబ్బంది అడ్డుకుంటున్నారు. కార్యాలయం లోపల తహసీల్దార్ బిజీగా ఉన్నారని, టెలి కాన్ఫరెన్స్‌లో ఉన్నారని చెబుతూ బయట వారిని చాలా సేపు నిలబెడుతున్నారు. విషయం తెలియని బాధితులు తహసీల్దార్ పిలుపు కోసం ఎదురు చూస్తూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.



తాడిపత్రిలో తహసీల్దార్‌తో పాటు మహిళా ఉద్యోగి మాత్రమే హాజరైన దృశ్యం

25 రోజులైనా మంజూరు చేయని ఇన్‌కం సర్టిఫికెట్

పట్టణంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో చేర్పించిన కూతురుకు ఇన్‌కం సర్టిఫికెట్ కోసం 25 రోజులుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఇంతవరకూ మంజూరు కాలేదని సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన క్రిష్టారెడ్డి సాక్షితో వాపోయారు. పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన క్రిష్టారెడ్డి కూతురు చదువు నిమిత్తం ఈనెల 6న సమీపంలోని సచివాలయంలో ఇన్‌కం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఇన్‌కం సర్టిఫికెట్‌ను తహసీల్దార్ సంతకంతో కేవలం ఏడు రోజుల్లో మంజూరు చేయాల్సి ఉంది. కానీ 25 రోజులు గడుస్తున్నా ఇంతవరకూ మంజూరు కాలేదు. సచివాలయం వద్దకు వెళ్తే తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని, అక్కడికి వెళ్తే తహసీల్దార్ సంతకం కోసం పెండింగ్‌లో పెట్టారని చెబుతున్నారే తప్ప ఇన్‌కం సర్టిఫికెట్ మంజూరు చేయడం లేదన్నాడు.

నోటీసులు పంపుతాం

సోమవారం ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి కేవలం ముగ్గురు ఉద్యోగులు హాజరు కావడం, అందులో ఇద్దరు సంతకాలు పెట్టి వెళ్లడంపై తహసీల్దార్ సోమశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులకు సంజాయిషీ కోరుతూ నోటీసులు ఇస్తామన్నారు. అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

రూ.1.37 కోట్లతో సోలార్ ప్యానళ్లు



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న అధికారులు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని మునిసిపల్ బిల్డింగులపై 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.37 కోట్లతో సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేయడానికి కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేసింది. మునిసిపల్ కార్యాలయంలో సోమవారం వైస్ చైర్మన్ షెక్షావలి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సందర్భంగా పలు తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మునిసిపల్ బిల్డింగ్‌లపై సోలార్ ప్యానెళ్లు బిగించడం వల్ల కరెంట్ బిల్లులను తగ్గించవచ్చని సభ్యులు అభిప్రాయపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబటి రాఘవేంద్రారెడ్డి ఇంటి నిర్మాణానికి సంబంధించిన కొలతలపై వచ్చిన అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకుని ఐదుగురు సభ్యులతో కలిసి కౌన్సిల్ కమిటీని ఏర్పాటు చేసింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు ఫయాజ్‌బాషా ఇంటి కొలతలపై తహసీల్దార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ రిపోర్టును కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. 15వ ఆర్థిక సంఘం కింద మంజూరైన పనులను రద్దు చేసి, కొత్త పనుల కోసం అన్‌టైడ్ గ్రాంట్ రూ.2.49 కోట్లు, టైడ్ గ్రాంట్ రూ.3.74కోట్లను కేటాయించారు. అండర్ డ్రైనేజీ మరమ్మతుల కోసం అంచనా వేసిన రూ.65లక్షల్లో రూ.10 లక్షలను మంజూరు చేస్తూ సభ్యులు ఆమోదించారు. మునిసిపల్ అభివృద్ధి పనుల కోసం తయారు చేసిన రూ.1,150 కోట్ల ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతూ తీర్మానం చేశారు. మునిసిపల్ కార్యాలయంలో ఎంఎస్ ర్యాక్‌ల ఏర్పాటుకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. కమిషనర్ శివరామక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ, టీడీపీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా నాయకులపై కేసులు దారుణం

గుత్తి: సోషల్ మీడియా నాయకులపై అకారణంగా కేసులు పెట్టి వేధించడం దారుణమని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. గుత్తిలో సోమవారం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నాయకుల ఆధ్వర్యంలో సోషల్ మీడియా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచిని సమాజానికి చేరువ చేయడం, ప్రభుత్వం తప్పులు ప్రజలకు తెలియజేయడం సోషల్ మీడియా బాధ్యత అన్నారు. అలాంటి సోషల్ మీడియాపై తప్పుడు కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్‌యాదవ్, పట్టణ ఉపాధ్యక్షుడు రంగస్వామి, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు గాదిలింగేశ్వర్ ,పట్టణ ఉపాధ్యక్షుడు చెన్నాజీ, నాయకులు సునీల్, విశ్వనాథ్ రెడ్డి, చిరు పాల్గొన్నారు.

విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయండి

గుత్తి: గుంతకల్లులోని పీఎంఆర్ ఫంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్‌కుమార్ యాదవ్, మండల మాజీ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి కోరారు. గుత్తిలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ స్థాయి సమావేశానికి పలువురు రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లి జయప్రదం చేయాలన్నారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, మాజీ కన్వీనర్ పీరా, మాజీ ఎంపీపీ కోనా మురళీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు రంగస్వామి, నజీర్, నాగరాజు, విశ్వనాథ్ రెడ్డి, అరటి పండ్ల చంద్ర, అబ్దుల్, లాలుస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంక్షిప్త సమాచారం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గుత్తి: ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా సూచించారు. గుత్తిలోని బీసీ కాలనీలో సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

పెద్దవడుగూరు: గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఎంపీడీఓ బారన్‌సాహెబ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గంగమ్మ దేవాలయం వద్ద ఉన్న ట్యాంకు వాల్ వద్ద తాగునీరు లీకేజీ అవుతున్న సంగతి తెలుసుకుని, మరమత్తు పనులను పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు సరఫరా చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, సర్పంచ్ వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పుట్లూరు: మండలంలోని మడ్డిపల్లి సచివాలయాన్ని సోమవారం ఎంపీడీఓ అలివేలమ్మ తనిఖీ చేశారు. కార్యాలయంలోని రిజిస్టర్లను పరిశీలించిన అనంతరం సిబ్బంది పనితీరుపై ఆమె ఆరా తీశారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.

రైల్లో నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

గుత్తి: గుత్తి జీఆర్‌పీ పరిధిలోని పాత కొత్తచెరువు రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారి కింద పడి సుద్దం ఆనం అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. జీఆర్‌పీ పోలీసుల వివరాల మేరకు రైల్లో డోర్ వద్ద నిలుచున్న ఆయన జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని జీఆర్‌పీ పోలీసులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైతులందరికీ ‘అన్నదాత సుఖీభవ’ అందించాలి

గార్లదిన్నె: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు నగదు అందించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ నాయకులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఈఓ శ్రీవాణికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనాథ్ చౌదరి, రాముడు, శంకర్, నల్లప్ప, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

గుత్తి: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గుత్తిలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం యూనియన్ అధ్యక్షుడు రాజా ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద కళ్లకు గంతులు కట్టుకుని మోకాళ్లపై నిలుచుని వినూత్నంగా ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 36 జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, కార్మికుడు మరణిస్తే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాకు వినతి పత్రం అందజేశారు.

రాచయ్య స్వామి ఆలయంలో చోరీ

బుక్కరాయసముద్రం: మండలంలోని గోవిందపల్లిలో ఉనన రాచయ్య స్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. స్థానికుల వివరాలు మేరకు.. గోవిందపల్లిలోని రేగడి కొత్తూరు రోడ్డు పక్కన ఉన్న రాచయ్య స్వామి దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి దుండగులు ప్రధాన గేటు తాళాలు పగులకొట్టి ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లారు. ఉదయాన్నే స్థానికులు గమనించి ఆలయంలో చోరీ జరిగిందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుండీలోని కానులకు ఇటీవల లెక్కించామని, ప్రస్తుతం హుండీలో రూ.10 వేల వరకు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామ పెద్దలు శేఖర్‌రెడ్డి గోపాల్‌రెడ్డి, వెంకటేశు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెహర్రం నిర్వహణకు అనుమతి తప్పనిసరి



సీఐ వెంకటేశ్వర్లు

బుక్కరాయసముద్రం: మొహర్రం (పీర్ల పండుగ) నిర్వహణకు అనుమతులు తప్పనిసరి అని బుక్కరాయసముద్రం సీఐ పుల్లయ్య సూచించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో పీర్ల పండుగ ఏర్పాటు చేయాలనుకునే వారు ముందుగా కమిటీగా ఏర్పడి పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో పోలీసు సిబ్బందితో బందోబస్తుకు ఏర్పాటు చేస్తామన్నారు. మసీదులు, పీర్ల చావిడి వద్ద డీజేలు సౌండ్ సిస్టంకు అనుమతి లేదన్నారు. ప్రశాంతంగా పీర్ల పండుగ నిర్వహించుకోవాలన్నారు. పీర్ల చావిడి వద్ద రాత్రి సమయంలో గుంపులుగా డీజే సౌండ్ల తప్పెట్లతో డ్యాన్స్‌లు చేయరాదన్నారు. తప్ప తాగి డ్యాన్స్‌లు, వీరంగం సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గొడవలు జరిగినట్లయితే కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఐఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపండి

పెద్దవడుగూరు: మండలంలోని బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు తప్పకుండా పంపాలని ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్ సూచించారు. సోమవారం మండలంలోని కడదరగుట్టపల్లి, కొండుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సంవత్సరం ఒకటో తరగతిలో ఒక్కరు కూడా చేరకపోవడాన్ని గుర్తించారు. ఉపాధ్యాయులు, సీఆర్‌టీలు ఆయా గ్రామాల్లో తిరిగి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను పాఠశాలకు పంపేలా చూడాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఉద్యోగి మృతి

గుంతకల్లు టౌన్: స్థానిక విద్యుత్ శాఖ రూరల్ పరిధిలో 15 ఏళ్లుగా ఔట్ సోర్సింగ్ విధానంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న మంజునాథ్ (41) ఆదివారం రాత్రి మృతిచెందారు. ఆయనకు భార్య, ఓ కుమార్తె ఉన్నారు. గుండెపోటు కారణంగా ఐదు రోజుల క్రితం కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయన సర్జరీ చేయించుకున్నారు. ఆదివారం రాత్రి రక్తపోటు హెచ్చుతగ్గుల కారణంగా ఆయన మృతి చెందినట్లు ట్రాన్స్‌కో ఏఈ రఘునాథ్ తెలిపారు. విషయం తెలుసుకున్న డీఈ నాగేంద్ర, ఏఈలు .. సోమవారం ఉదయం మృతుడి నివాసానికి వెళ్లి మంజునాథ్‌కు నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

బుక్కరాయసముద్రం: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తోందని క్షయ వ్యాధి నివారణ అధికారిణి శ్రావణి అన్నారు. సోమవారం మండలంలోని జిల్లా జైల్లో క్షయ వ్యాధి నిర్మూలనపై ఖైదీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలకు మందులు అందుబాటులో ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జైల్లో 176 మందికి పరీక్షలు నిర్వహించి, అందులో 18 మంది నుంచి నమూనాలు జిల్లా కేంద్రానికి పంపించామన్నారు. కార్యక్రమంలో జైలు అధికారులు వసంతకుమార్ నాగరాజు, చంద్రమోహన్, వైద్య సిబ్బంది నాగమణి, శ్రీనివాసరెడ్డి, నిర్మల, రమణారెడ్డి, జయంతి, రమాదేవి, రాజగోపాల్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

బుక్కరాయసముద్రం/యాడికి/పామిడి: వృత్తి ఏదైనా సరే అంకిత భావంతో పని చేస్తే గుర్తింపు తప్పని సరిగా లభిస్తుందని ప్రధానోపాధ్యాయురాలు నీరజ అన్నారు. సోమవారం బుక్కరాయసముద్రం మండలంలోని సిద్దరాంపురం జెడ్పీ హైస్కూల్‌లో బయాలజీ సబ్జెక్టు ఉపాధ్యాయునిగా పని చేస్తున్న సుధా కిరణ్ పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు నీరజ, అంకిరెడ్డి, ఆది నారాయణ, కోటేశ్వరప్ప, బాలక్రిష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యాడికి మండల కేంద్రంలోని సీఎస్ఐ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చెందిన ఉపాధ్యాయుడు బుడ్డా జయప్రసాదరావును సోమవారం మండల విద్యాధికారులు కాశెప్ప, ధనలక్ష్మి, టీచర్లు, పాస్టర్లు, బంధువులు, గ్రామ ప్రజలు, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యాడికి ఉన్నత పాఠశాల హెచ్ఎం సీతారామాంజనేయులు, టీచరు శ్రీనివాసయాదవ్, ఆంజనేయులు, ఫాస్టర్లు జయరాజు, ప్రసాద్, సాయి నవీన్, సీఎస్ఐ స్కూల్ కరస్పాండెంట్ ప్రసున్న తదితరులు పాల్గొన్నారు. అలాగే పదవీ విరమణ చెందిన తాడిపత్రి సబ్ డివిజన్ ప్రభుత్వ నేత్ర వైద్యాధికారి మధుసూదన్‌రాజును స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుమంత్ రెడ్డి , తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, సీహెచ్ఓ జుబేదా భేగం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పామిడి మండలంలోని పీ కొండాపురం ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ చేసిన హెచ్ఎం కే సూర్యనారాయణ దంపతులను ఎంఈఓ-2 సత్యనారాయణ, ఉపాధ్యాయులు, నాయకులు సన్మానించారు. అలాగే బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు బీ వెంకటరమణను సత్కరించారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవడుగూరు/గార్లదిన్నె/శింగనమల/గుత్తి రూరల్: ప్రతిఒక్కరూ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. సోమవారం పెద్దవడుగూరు మండలంలోని చిట్టూరు, గార్లదిన్నె మండలంలోని బూదేడు ఎస్సీ కాలనీ, శింగనమల మండలంలోని చిన్నజలాలపురం ఎస్సీ కాలనీ, గుత్తి మండలంలోని పి.ఎర్రగుడిలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఆర్ఐలు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.